సాక్షి
మహబూబాబాద్

బుధవారం | 23 | ఆగస్టు | 2023



4న వల్మిడికి సీఎం కేసీఆర్

పాలకుర్తి మండలం వల్మిడిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని సీఎం కేసీఆర్ వచ్చే నెల 4న ప్రారంభించనున్నారు. - 10లో▸



సామాజిక విప్లవయోధుడు గద్దర్

ప్రజాయుద్ధ నౌక గద్దర్ గొప్ప సామాజిక విప్లవ యోధుడని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
33.2^0 / 25.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యావ్యవస్థను గాలికొదిలేసిన పాలకులు



మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో విద్యావ్యవస్థను పాలకులు గాలికి వదిలేశారని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు స్టాలిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై ముందుగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమరశీల ఉద్యమాల ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నియామకాలు, నిధులు లేక ప్రభుత్వ విద్యారంగం ఆగమవుతుందన్నారు. ఉద్దేశపూర్వకంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరించాయన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్, జిల్లా మాజీ కార్యదర్శి పెరుగు కుమార్, జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్, రాష్ట్ర నాయకులు బందు మహేందర్, నాయకులు మేక వెంకటేశ్, చిలువేరు వికాస్, లకావతి సతీష్, బానోత్ సాయికుమార్, జిల్లా నాయకులు సూర్యసారథి, మహేష్, సందీప్, రంజిత్ కుమార్, లక్ష్మీకుమార్, ఎల్లయ్య, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ల నియామకం

మహబూబాబాద్ అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు మానుకోట పార్లమెంట్ కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచదర్‌రావు మంగళవారం తెలిపారు. కొత్తగూడెం కన్వీనర్‌గా ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మహబూబాబాద్ జాయింట్ కన్వీనర్‌గా సింగారపు సతీష్, ములుగు జాయింట్ కన్వీనర్‌గా తక్కళ్లపల్లి దేవేందర్ రావు, వరంగల్ జాయింట్ కన్వీనర్‌గా జాటోత్ సంతోష్‌ను నియమించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు ఆంగ్లంపై పట్టు సాధించాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయులు ఆంగ్లంపై పట్టు సాధించాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులకు ఇంగ్లిష్‌పై శిక్షణ ఇవ్వగా.. ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు ఆంగ్లంపై పట్టుసాధించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు మహంకాళి బుచ్చయ్య, జయసాగర్, మధు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిలో బోధించడానికి అర్హులైన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ కె. ప్రత్యూష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకేషనల్ గ్రూపులో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనికి ఎమ్మెస్సీ హోం సైన్స్ పూర్తి చేసిన మహిళలు అర్హులన్నారు. తొర్రూరు గురుకులంలో జువాలజీ, హిందీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఇనుగుర్తి పాఠశాలలో మ్యాథ్స్, నర్సింహులపేట పాఠశాలలో జువాలజీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 28న ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్ సెట్లు, రెండు పాస్ ఫొటోలు, దరఖాస్తు ఫారాలు జిల్లా కేంద్రంలోని పాఠశాలలో అందజేసి డెమో క్లాసులు చెప్పాలన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 9 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం నిర్వహించిన దూరవిద్య బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఫైనల్ ఇయర్ పరీక్షల్లో 9మంది డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ తెలిపారు. జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 8 మంది విద్యార్థులు, లక్సెట్‌పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు కాపీయింగ్ చేస్తూ డీబార్ అయ్యారని వారు తెలిపారు.

16న నిట్ స్నాతకోత్సవం

కాజీపేట అర్బన్: స్నాతకోత్సవానికి నిట్ ముస్తాబవుతోంది. సెప్టెంబర్ 16న నిర్వహించనున్న 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా డీఆర్డీఓ రిటైర్డ్ సెక్రటరీ పద్మభూషణ్ విజయ్ కుమార్ హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో పాల్గొని పట్టాలందుకోవాలనుకునే నిట్‌లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఈనెల 23 నుంచి నిట్ వరంగల్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని యాజమాన్యం కల్పించింది.

కలిసి పని చేస్తారా!

అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశం

- ఒకే పార్టీలో ఉన్నా నాయకుల ఎవరిదారి వారిదే..
- నిన్నటి వరకు తిట్టిన నోటితో పొగడడం సాధ్యమేనా.?
- జిల్లా నాయకుల మధ్య సయోధ్యపై చర్చ



సాక్షి, మహబూబాబాద్: అధికార బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుల్లో సమన్వయం కొరవడింది. నిన్నటి వరకు వర్గాలుగా విడిపోయి ఒకరిపై మరొకరు విమర్శలు, ఆరోపణలు చేసుకున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేశారు. అయితే గులాబీ బాస్ తీసుకున్న 'సిట్టింగ్'ల నిర్ణయంతో అందరి ఆశలు గల్లంతయ్యాయి. పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని అధిష్టానం ఆదేశించడంతో.. సమష్టిగా పని చేస్తారా.. లేదా గీత దాటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతారా అనేది జిల్లాలో చర్చగా మారింది.

కలిసి సాగేనా..

మహబూబాబాద్ నియోజకవర్గంలో మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీలో నలుగురు నాయకులు ఎనిమిది గ్రూపులు అన్న చందంగా ఉంది. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎంపీ మాలోత్ కవితల మధ్య వర్గపోరు అధిష్టానం వరకు వెళ్లిన విషయం తెలిసిందే. నియోకవర్గంలోని మహబూబాబాద్ పట్టణంతోపాటు గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం మండలాల్లో గ్రూపుల వారీగా కార్యక్రమాలు చేపట్టారు. అయితే ప్రసుత్తం పార్టీ టికెట్ శంకర్‌నాయక్‌కు ఇచ్చిన నేపథ్యంలో కలిసి పని చేస్తారా అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అధిష్టానం ఆదేశాలతో ఎంపీ సహకరించినా.. ఆమె వర్గీయులు కలిసి వస్తారా అనేది చర్చ. కాగా ఈ పరిస్థితిని చక్కబెట్టేందుకు కవిత ఏం చేస్తారో వేచి చూడాలి. అలాగే ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, శంకర్‌నాయక్ మధ్య వైరం తారాస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే ఆయన వర్గీయులు మహబూబాబాద్ పట్టణంతోపాటు అన్ని మండలాల్లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ టికెట్ ఇస్తే ఓడిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఏ మేరకు కార్యకర్తలను సమన్వయం చేస్తారు.. ఇప్పటి వరకు తిట్టిన నోటితోనే శంకర్ నాయక్‌కు పొగిడి ఓట్లు వేయమని చెబుతారా.. అందుకు కార్యకర్తలు సుముఖంగా ఉంటారా అనేది రాజకీయ వర్గాలను తొలుస్తున్న ప్రశ్న.

పదవులు ఇవ్వలేదని విమర్శలు

ఎవరు ఏ పార్టీలో ఉన్నా.. మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రెడ్యానాయక్ మధ్య వైరం కొనసాగుతోంది. చిరకాల ప్రత్యర్థులుగా పోటీలో ఉంటూ వచ్చిన వీరు 2014 ఎన్నికల తర్వాత ఒకే గూటికి చేరారు. అయితే ఎవరి దారి వారిదే. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సత్యవతిని ఎమ్మెల్సీతోపాటు, మంత్రి పదవి కూడా వరించింది. అయితే రాష్ట్రానికి మంత్రి అయినా.. డోర్నకల్‌కు మాత్రం కాదనే రీతిలో రెడ్యానాయక్ ఆమెను నియోజకవర్గానికి రానివ్వలేదని విమర్శలు వచ్చాయి. అదేవిధంగా సత్యవతి వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలకు రెడ్యా ఏనాడు ప్రాధాన్యత ఇవ్వలేదు. మండల, గ్రామ పార్టీ పదవులు, ఇతర నామినేటెడ్ పదవులు కూడా ఆమె వర్గానికి ఇవ్వలేదని విమర్శలు వచ్చాయి. ఇటీవల చేపట్టిన నియోజకవర్గ పర్యటనలో ఎదురైన వ్యతిరేకతకు సొంత పార్టీలోనే శత్రువులు ఉన్నారని, వారితోనే ఇబ్బంది అవుతుందని రెడ్యా బహిరంగంగా చెప్పారు. ఈ పరిస్థితిలో ఇరు వర్గాలకు చెందిన నాయకులు ఏమేరకు కలిసి పని చేస్తారు. ఇప్పటి వరకు శత్రువులుగా ఉన్న వారు మిత్రులు అవుతారా.. అటు అధిష్టానం ఆదేశాలు.. ఇటు కార్యకర్తల నుంచి వచ్చే వ్యతిరేకతతో మంత్రి ఎలా స్పందిస్తారో చూడాలి.

● సీఎంను కలిసిన ఎమ్మెల్యే



మానుకోట అసెంబ్లీ టికెట్ మరోసారి కేటాయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మంగళవారం సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ సీతామహాలక్ష్మి, కూతురు తేజస్వి, కుమారుడు సూర్యచంద్ర ఉన్నారు. – మహబూబాబాద్

దివ్యాంగ ఓటర్లను పరిశీలించాలి

● కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: దివ్యాంగ ఓటర్లను ఎన్నికల అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో నడవలేని వారు, పోలింగ్ కేంద్రాలకు రానివారు ఉంటారని, వారికి పోస్టల్ బ్యాలెట్ అందజేసేందుకు సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. దివ్యాంగ ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి పరిశీలించాలని, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న బీఎల్ఓల స్థానాల్లో జూనియర్ పంచాయతీ అధికారులను తీసుకోవాలన్నారు. ఎంపీడీఓలతో కలిసి 18సంవత్సరాలు నిండిన దివ్యాంగులను గుర్తించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. జిల్లాలో వైద్య ధ్రువీకరణ పత్రంతో పాటు సదరం సర్టిఫికెట్ పొందిన వారు 2,3844 మంది ఉన్నారన్నారు. ఓటరు ముసాయిదా జాబితా నివేదికను సీడీ రూపంలో సాఫ్ట్‌కాపీ అందజేశామని తెలియజేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

అవగాహనతో పని చేయాలి

నోడల్ అధికారులు పూర్తి అవగాహనతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు 19విభాగాలకు అధికారులను నియమించారు. అలాగే విధుల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియామకమైన అధికారులు ఎన్నికల విధులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దిగొస్తున్న టమాట

తగ్గుతున్న ధరలు

- ఇతర రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతి
- కిలో రూ.30నుంచి రూ.40 వరకు అమ్మకాలు
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు

తొర్రూరు: టమాట ధరలు దిగొస్తున్నాయి. కొంత కాలంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారిన ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. దీంతో సమాన్య ప్రజలు కాస్త ఊరట కలగనుంది. వర్షాకాలం ఆరంభం నుంచి అమాంతంగా పెరిగిన ధరలతో కొనాలంటేనే జనం ఆలోచించారు. అయితే నాలుగు రోజులుగా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి కావడంతో ధరలు భారీగా తగ్గాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

నాలుగు రోజులుగా..

మార్కెట్‌లో 25 కిలోల బరువు ఉండే టమాట పెట్టె రూ.1,800 నుంచి రూ.2,200 వరకు పలికింది. వ్యాపారులు, చిల్లర అమ్మేవారు ఇదే అదనుగా కిలో రూ.150 నుంచి రూ.200 వరకు అమ్ముకున్నారు. అయితే నాలుగు రోజులుగా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ప్రధాన మార్కెట్‌లలో 25 కిలోల పెట్టె రూ.600 నుంచి రూ.1,000మించలేదు. దీంతో చిల్లర వ్యాపారులు కిలో రూ.30నుంచి రూ.40వరకు అమ్ముతున్నారు. పలు మండలాల్లోని వారాంతపు సంతల్లో సైతం ఇదే ధర పలుకుతోంది. ధరలు తగ్గడానికి కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేసుకోవడం వల్లే ధరలు తగ్గినట్లు రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన సాగుతోనే..

ఈ సీజన్‌లో లాభాలు తెచ్చి పెడుతుండడంతో ఖరీఫ్‌లో చాలా మంది రైతులు టమాట సాగుకు ముందుకు వచ్చారు. వర్షాలు కురవడంతో ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేశారు. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. జిల్లాలో 116 ఎకరాలకు మించని టమాట సాగు ప్రస్తుతం 500 ఎకరాలకు పైగానే సాగులో ఉందని ఉద్యాన అధికారులు పేర్కొంటున్నారు. రైతులు ఇక్కడ పండించిన టమాటను వరంగల్, హైదరాబాద్, ఖమ్మం తదితర మార్కెట్‌లకు తరలిస్తున్నారు. మరికొందరు సమీప ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంతలకు తరలిస్తారు. పంట కాలం పూర్తయ్యేసరికి ఎకరానికి 25 కిలోల పెట్టెలు 450 నుంచి 500 వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. మందులు, ఎరువులు, కలుపు ఇతర పెట్టుబడి ఖర్చుల కోసం ఎకరానికి రూ. 25వేల నుంచి రూ.60 వేల వరకు వస్తుంది.



తొర్రూరు మండలం కొత్తగూడెంలో పెట్టెల్లో నింపిన టమాటాలు

ధరలు ఇంకా దిగి వస్తాయి



టమాట ధరల పెరుగుదల తాత్కాలికం. తాజా పంట రాగానే ధరలు తగ్గుతాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా దిగుబడులు క్షీణించాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రవాణాపై ప్రభావం పడింది. మరికొన్ని చోట్ల వర్షాల వల్ల టమాట పంట దెబ్బతింది. క్రమంగా పరిస్థితులు సర్దుకుంటున్నాయి. పంట మార్కెట్‌కు వస్తుండటంతో ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది.

– సూర్యనారాయణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి

కాంగ్రెస్ ఆశావహుల హైదరాబాద్ బాట

అభ్యర్థులపై ఊహాగానాలు.. పోటాపోటీగా దరఖాస్తులు

- పశ్చిమనుంచి నాయిని రాజేందర్ రెడ్డి, జంగా రాఘవరెడ్డి
- వర్ధన్నపేట నుంచి నమిండ్ల శ్రీనివాస్, మాజీ సీపీ నాగరాజు
- మరో ఆరు నియోజకవర్గాల నుంచి దాఖలైన దరఖాస్తులు...
- జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. రేపు పొన్నాల అప్లికేషన్
- తూర్పు కోసం నేడు కొండా సురేఖ, ఎర్రబెల్లి స్వర్ణల దరఖాస్తు...
- మరో రెండు రోజులే గడువు.. టికెట్ సాధనే లక్ష్యంగా లాబీయింగ్..



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల కోసం ముందస్తుగా బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.. ఇప్పుడు రాజకీయ పరిశీలకుల దృష్టి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల వైపు మళ్లింది. అధికార బీఆర్ఎస్ జనగామ మినహా 11 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసి ఎన్నికలకు సన్నద్ధమైంది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సైతం అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియలో భాగంగా ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ నెల 18న మొదలైన ఈ ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుండగా ఉమ్మడి వరంగల్‌లో ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాలు మినహా 11 అసెంబ్లీ స్థానాల నుంచి టికెట్ కోసం ఆశావహులు పోటాపోటీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. 25వ తేదీ తర్వాత దరఖాస్తులను పరిశీలించనున్న ఏఐసీసీ, సీడబ్ల్యూసీ, టీపీసీసీ కమిటీలు.. త్వరలోనే అభ్యర్థులను సైతం ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారంతో ఆశావహులు ఢిల్లీ, హైదరాబాద్‌లలో లాబీయింగ్ ముమ్మరం చేశారు.

దరఖాస్తులనుంచే వివాదాలకు ఆజ్యం..

దరఖాస్తు చేసుకున్న ఆశావహుల జాబితాను డీసీసీ, టీపీసీసీ స్క్రీనింగ్ కమిటీలు ఢిల్లీకి పంపేందుకు కూడా ఏర్పాట్లు జరిగాయి. దరఖాస్తుల దాఖలునుంచే కొన్ని నియోజకవర్గాలు వివాదాస్పదమవుతున్నాయి. ఇది అధిష్టానానికి తలనొప్పిగా మారనుంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైందన్న సమయంలో జనగామ డీసీసీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి ఇదే స్థానం నుంచి పోటీ చేస్తానని ప్రకటించడం అప్పట్లో వివాదాస్పదమైంది. తాజాగా నాయినితోపాటు జంగా కూడా టికెట్ కోసం మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. జనగామ నుంచి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా.. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య గురువారం దరఖాస్తు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ తూర్పు టికెట్ కోసం బుధవారం కొండా సురేఖ దరఖాస్తు చేయనుండగా.. అదే రోజు వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అప్లికేషన్ పెట్టుకోనున్నారు. వర్ధన్నపేట నుంచి నమిండ్ల శ్రీనివాస్‌తోపాటు మాజీ పోలీస్ అధికారి కేఆర్ నాగరాజు దరఖాస్తు చేసుకోగా.. ఇక్కడినుంచి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య కూడా ఆశిస్తున్నారు.

పోటాపోటీగా దరఖాస్తులు..

ఉమ్మడి వరంగల్‌లో ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాలు మినహా అన్ని స్థానాల నుంచి ఆశావహులు పోటాపోటీగా దరఖాస్తులు చేస్తున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ దొమ్మాటి సాంబయ్య స్టేషన్ ఘన్‌పూర్ నుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆయన తిరుగుతున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సింగపురం ఇందిర ఆ తర్వాత నియోజకవర్గానికి దూరంగా ఉన్నా.. మరోసారి టికెట్ కోసం శుక్రవారం దరఖాస్తు చేసుకోనున్నట్లు తెలిసింది. పరకాలనుంచి ఇనుగాల వెంకట్రాంరెడ్డి టికెట్ ఆశిస్తుండగా.. కొండా మురళీధర్‌రావు కూడా బుధవారం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్న ప్రచారం ఉంది. డోర్నకల్ నియోజకవర్గం నుంచి యువ పారిశ్రామిక వేత్త నునావత్ భూపాల్ నాయక్ దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడినుంచి మరో ముగ్గురు సీనియర్లు నేడు, రేపు దరఖాస్తు చేయనున్నారు. మహబూబాబాద్‌నుంచి అవకాశం ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్, డాక్టర్ మురళీనాయక్‌లు అధిష్టానాన్ని కలిసి టికెట్ కోరారు. కాగా హుస్నాబాద్ నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తోపాటు ఒంటెల లింగారెడ్డి కూడా టికెట్ కోసం మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. మరో రెండు రోజుల గడువు ఉండటంతో ఇంకా కూడా దరఖాస్తులు దాఖలు కానున్నాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఆశావహులు ఢిల్లీ, హైదరాబాద్ స్థాయిలలో లాబీయింగ్ ముమ్మరం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

మహబూబాబాద్ రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పతనం ఖాయమని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ఈ నెల 26న చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, 29న వరంగల్‌లో మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎమ్మెల్యేల జాబితాను చూస్తే గొర్రెల మందపై తోడేళ్లను వదిలిపెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు. లిస్టులో భూకబ్జాదారులు, దళిత బంధులో కమీషన్లు తీసుకున్నవారు, దోపిడీదారులే ఎక్కువగా ఉన్నారని విమర్శించారు. 100రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి టికెట్‌కు దరఖాస్తు చేస్తున్నానని, టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ వెంకటి, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల గుట్టయ్య, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, తేజావత్ శంకర్, లింగాల వీరభద్రం, నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్

కేయూ బాటనీ విభాగం బీఓఎస్‌గా ముస్తఫా

కేయూ క్యాంపస్: కేయూ బాటనీ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ (బీఓఎస్)గా ప్రొఫెసర్ మహ్మద్ ముస్తఫాను నియమించారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు లలితాకుమారి బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పదవీకాలం పూర్తికావడంతో ముస్తఫాను నియమించారు. ఆయన ప్రస్తుతం కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా కూడా కొనసాగుతున్నారు.

మైక్రోబయాలజీ విభాగం బీఓఎస్‌గా శ్రీనివాస్ ముంజం..

మైక్రోబయాలజీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ ముంజంను నియమిస్తూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు బీఓఎస్‌గా డాక్టర్ పి.వెంకటయ్య బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన పదవీకాలం పూర్తికావడంతో శ్రీనివాస్‌ను నియమించారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

కొత్తగూడ: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి కేసీఆర్ తన ఖజానా నింపుకున్నారని ఆరోపించారు. మళ్లీ మాయమాటలతో ప్రజల ముందుకు వస్తున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో కొత్తగూడ, గంగారం ఎంపీపీలు బానోతు విజయ రూప్‌సింగ్, సరోజన, వైస్ఎంపీపీ జంపయ్య, నాయకులు చల్లా నారాయణరెడ్డి, సారయ్య, మొగిళి, రమేష్, బిట్ల శ్రీనివాస్, సారంగం, సమ్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫస్టియర్‌లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని కాలేజీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన విద్యార్థినులకు ప్రాధాన్యం ఉంటుందని, రిజర్వేషన్ ప్రకారం గిరిజనేతరులకు అవకాశం ఉందన్నారు. కళాశాలలో ఎంపీసీఎస్, బీఏ, బీకాం జనరల్, ఎఫ్‌జెడ్‌సీ, బీకాం సీఏ, బీజెడ్‌సీ గ్రూపులు ఉన్నాయన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

స్పెషల్‌ డ్రైవ్‌ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు


మీర్‌ కౌకబ్‌ అలీ, ప్రిన్సిపాల్‌

న్యూశాయంపేట: వరంగల్‌లోని ఇస్లామియా ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో దోస్త్‌–2023 స్పెషల్‌ డ్రైవ్‌ ద్వారా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మీర్‌ కౌకబ్‌అలీ మంగళవారం తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టి అడ్మిషన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో ఇంగ్లిష్‌ మీడియంలో బీకాం(కంప్యూటర్‌ అప్లికేషన్స్‌), బీబీఏ కోర్సులు, ఉర్దూ మీడియంలో బీఏ(పొలిటికల్‌ సైన్స్‌, పబ్లిక్‌ అడ్మిస్ట్రేషన్‌), బీఎస్సీ(బీజెడ్‌సీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. దోస్త్‌ ఆన్‌లైన్‌ కోఆర్డినేటర్‌ ఇర్ఫాన్‌ ముజాహిద్‌(9963886005), నూరొద్దీన్‌ సందానీ(8142581807), జునైద్‌ ఖాన్‌(8499099375)ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయ వేళల్లో సంప్రదించాలన్నారు.

బైక్‌ ఢీ.. వ్యక్తి దుర్మరణం


మల్లయ్య (ఫైల్‌)

మహదేవపూర్‌ : బైక్‌ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జయశంకర్‌ భుపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం బొమ్మపూర్‌ గ్రామ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన పీక పెద్ద మల్లయ్య (60) నడుచుకుంటూ తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని అంబట్‌పల్లికి చెందిన బొంపెల్లి మాధవరావు ద్విచక్రవాహనంపై మహదేవపూర్‌ నుంచి గ్రామానికి వెళ్తూ మల్లయ్యను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై భార్య పోషక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్‌ తెలిపారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

న్యూశాయంపేట : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్‌ఐ) రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 25 నుంచి 27 వరకు హసన్‌పర్తిలోని శ్రీ శుభమస్తు గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని, ఈ తరగతులను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్‌ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ సుందరయ్య భవన్‌లో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. నోముల కిశోర్‌, డి.తిరుపతి, సాంబమూర్తి, ఓర్సు చిరంజీవి పాల్గొన్నారు.



సామాజిక విప్లవయోధుడు గద్దర్‌

- చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌, టీజేఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, గాదె ఇన్నయ్య
- గద్దర్‌ విగ్రహం ఏర్పాటు చేయాలని రైల్వే జేఏసీ తీర్మానం


మాట్లాడుతున్న చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌

కాజీపేట రూరల్‌: ప్రజాగాయకుడు గద్దర్‌ గొప్ప సామాజిక విప్లవ యోధుడని చీఫ్‌విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, భారత్‌ బచావ్‌ జాతీయ నాయకుడు గాదె ఇన్నయ్య అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీహాల్‌లో మంగళవారం తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్‌ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్‌, జహీరుద్దీన్‌ అలీఖాన్‌ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి పాటల ద్వారా గద్దర్‌, పత్రికతో అలీఖాన్‌ ఎంతో కృషి చేశారన్నారు. సమాజంలో దోపిడీ వ్యవస్థ పోవాలని ఉద్యమించిన నిత్య సామాజిక యోధుడు గద్దర్‌ అన్నారు. గద్దర్‌ 1973లో ఓరుగల్లు సభ నుంచి ప్రపంచ విప్లవానికి నాంది పలికారన్నారు. సీనియర్‌ జర్నలిస్ట్‌ పాశం యాదగిరి, అరుణోదయ సంస్కృత సమైఖ్య తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మా మాట్లాడుతూ సమసమాజం కోసం తన పాట రూపంలో గళం విప్పి అన్ని వర్గాల పక్షాన నిలిచిన సామాజికవేత్త గద్దర్‌ అన్నారు. రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ జోనల్‌ ప్రెసిడెంట్‌ కె.శ్రీనివాస్‌, రైల్వే జేఏసీ చైర్మన్‌ కొండ్ర నర్సింగరావు, కన్వీనర్‌ దేవులపల్లి రాఘవేందర్‌ మాట్లాడుతూ కాజీపేట రైల్వే డివిజన్‌, రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ కోసం గద్దర్‌ పాదయాత్ర చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్‌ విగ్రహం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు వినయ్‌భాస్కర్‌ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ సంగంరెడ్డి పృథ్వీరాజ్‌, కూరపాటి వెంకటనారాయణ, కార్పొరేటర్‌ సంకు నర్సింగరావు, సింగారపు రవిప్రసాద్‌, ఎ.సంతోష్‌కుమార్‌, ఓరుగంటి యాకయ్య, వెంగల్‌రెడ్డి, పుట్టరవి, తరాల సందీప్‌, మర్యాల కృష్ణ, గద్దర్‌ సాంబయ్య, అనిత, పల్లపు సమ్మయ్య, జానీ, వేదప్రకాష్‌ పాల్గొన్నారు.

పెస్టిసైడ్స్‌ స్ప్రే చేస్తున్నారా..!

- అయితే జాగ్రత్తలు తప్పని సరి
- పురుగు మందుల వాడకంపై అవగాహన ఉండాలి
- మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ మాలతి, శాస్త్రవేత్త కిశోర్‌కుమార్‌


పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు

మహబూబాబాద్‌ రూరల్‌: సస్యరక్షణలో భాగంగా పంటలను ఆశించే చీడపీడలను నియంత్రించడానికి రైతులు అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల చీడపీడలు అంతరించి పంట దిగుబడి అధికంగా వస్తుంది. అయితే ఈ మందులు పంటలను ఆశించే పురుగులకు మాత్రమే హానికరమైనవి కాదు.. మొక్కలు, పంటకు మంచి చేసే కీటకాలు, ఇతర జంతుజాలం, మనుషులకు కూడా ప్రమాదకరమే. అందుకే ఈ క్రిమిసంహారక మందులను జాగ్రత్తగా వినియోగించుకోకపోతే మనుషులు, పెంపుడు జంతువులకు ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. పురుగు మందుల ఎంపిక దగ్గర నుంచి.. వాటిని చల్లే వరకు.. ప్రతీ విషయంలో జాగ్రత్తలు పాటిస్తే మందుల విష ప్రభావం వల్ల ఎదురయ్యే సమస్యలను నియంత్రించొచ్చు. ఈ నేపథ్యంలో పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహబూబాబాద్‌ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ ఎస్‌.మాలతి, శాస్త్రవేత్త ఎన్‌.కిశోర్‌కుమార్‌ 'సాక్షి'కి వివరించారు.

పురుగు మందుల ఎంపిక

- పురుగు మందులు పొడి, ద్రవ, గుళికల రూపంలో మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి.
- పంటకు వచ్చిన రోగం నయం కావడానికి అవసరమైన మందును ఎంపిక చేసుకోవాలి.
- పురుగు మందు డబ్బా మీద ఇతర వివరాలు గల పేపర్‌ను జాగ్రత్తగా చదివి మెళకువలు పాటించాలి.

పురుగు మందులు భద్రపరిచే విధానం

- డబ్బాలను గట్టిగా మూసి ఉంచాలి
- ఎక్కువ విష ప్రభావం గల డబ్బాలను విడిగా భద్రపరచాలి.
- మందు కొన్నప్పుడు ఏ డబ్బాలో ఉందో అందులోనే ఉండాలి. వేరే డబ్బాలోకి మార్చొద్దు.
- ఆహార పదార్థాలు, విత్తనాలు, నీరు ఉన్న గదిలో పురుగు మందులను నిల్వ ఉంచొద్దు
- గాలి, వెలుతురు ఉన్న చోటు, ఎండ, అగ్ని తగలని చోట నిల్వ ఉంచాలి.
- అప్పుడప్పుడు గమనిస్తూ చిల్లు పడిన వాటిని శుభ్రం చేసి పెట్టుకోవాలి.
- పురుగు మందులను.. తెగులు, కలుపు మందుల నుంచి వేరుగా భద్రపరచాలి.

మందు ద్రావణ తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- లేబుల్‌ మీద ఉన్న విషయాలను చదవాలి.
- స్ప్రేయర్‌ కండీషన్‌ బాగుందా, లేదా గమనించాలి.
- నీరు, సబ్బు, రుమాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- మందు ద్రావణాన్ని గరాటుతో పోయాలి. పొరపాటున కూడా నోటితో పీల్చొద్దు.

మందు చల్లిన తర్వాత జాగ్రత్తలు

- స్ప్రే పంపు విడి భాగాలను శుభ్రం చేయాలి.
- స్ప్రే చేసిన పొలాల్లో గుర్తులు పెట్టుకోవాలి. (జెండాలు పాతాలి)
- మందు డబ్బాలను వినియోగం తరువాత ఇతర పనులకు వాడొద్దు. భూమిలో పాతిపెట్టాలి.

రౌడీ షీటర్‌ బెదిరిస్తున్నాడు!

- గీసుకొండ ఎంపీపీ సౌజన్య

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన ఓ రౌడీ షీటర్‌ సోషల్‌ మీడియా ద్వారా తనను బెదిరిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ భీమగాని సౌజన్య కోరారు. ఇటీవల కాంగ్రెస్‌ నుంచి సస్పెండ్‌ అయిన సదరు రౌడీ షీటర్‌ మంగళవారం రాత్రి గీసుకొండ 'వీఐపీఎస్‌'..వాట్సాప్‌ గ్రూపులో తనపై అవాస్తవ విషయాలను పోస్టు చేశాడని తెలిపారు. బీఆర్‌ఎస్‌లో చేరడానికి తాను రూ. 16 లక్షలు డిమాండ్‌ చేశానంటూ ఆరోపణలు చేశారన్నారు. దీనిపై సదరు రౌడీ షీటర్‌పై వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌, మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. అతడితో తనకు ప్రాణభయం ఉందని ఎంపీపీ పేర్కొన్నారు.

గన్‌ పౌడర్‌ స్వాధీనం

- నలుగురిపై కేసు


పట్టుకున్న గన్‌పౌడర్‌తో సీఐ నాగబాబు, సిబ్బంది

తరిగొప్పుల: అక్రమంగా తరలిస్తున్న గన్‌ పౌడర్‌ను పట్టుకున్న పోలీసులు.. మంగళవారం నలుగురిపై కేసు నమోదు చేశారు. మండలంలోని మాన్‌ సింగ్‌ తండా శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఆటోను తనిఖీ చేయగా క్యారీల్లో పేలుళ్లకు ఉపయోగించే 480 కిలోల గన్‌పౌడర్‌ లభించింది. దీంతో ఆటోలో ఉన్న హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పురుకు చెందిన వల్లెపు నాగరాజు, వల్లెపు సమ్మయ్య, చిల్పూర్‌ మండలం లింగంపల్లికి చెందిన సూర సారయ్య, కొమ్ము గుట్టకు చెందిన బొమ్మ రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని నర్మెట సీఐ నాగబాబు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై దూదిమెట్ల నరేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

4న వల్మిడికి సీఎం కేసీఆర్‌


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు


మంత్రికి ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

- రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్‌ : జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని సీఎం కేసీఆర్‌ వచ్చే నెల 4వ తేదీన ప్రారంభించనున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈమేరకు మంగళవారం కలెక్టర్‌ శివలింగయ్య, ఇతర శాఖల అధికారులు, ఎర్రబెల్లి ట్రస్ట్‌ చైర్‌ పర్సన్‌ ఉషాదయాకర్‌రావుతో కలిసి ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన పలు అంశాలపై వల్మిడి గుట్టపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ ప్రారంభానికి సీఎం కేసీఆర్‌, ఇతర శాఖల మంత్రులు వస్తున్నారన్నారు. భద్రాద్రిని తలపించేలా వల్మిడిలో సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని నిర్మించామన్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్‌ కలెక్టర్‌ రోహిత్‌ సింగ్‌, డీసీపీ సీతారాములు, ఏసీపీ సురేష్‌ కుమార్‌, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు ఎండీ మదార్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌, సర్పంచ్‌ వీరమనేని యాకాంతారావు, కత్తి సైదులు, తాళ్ల సోమనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం..

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ మళ్లీ అధికారంలోకి వస్తేనే ప్రజలు బాగుపడతారని పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్‌ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తనకు టికెట్‌ కేటాయించిన సందర్భంగా మంగళవారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని మంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చేలా దీవించాలని యాదాద్రీశుడిని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వస్తుందని, కేసీఆర్‌ మూడో సారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయనకు ఆచార్యులు ఆలయంలో సంప్రదాయంగా స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లికి ఆచార్యులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

చెరువు కబ్జాపై బహిరంగ చర్చకు రావాలి

- ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు కాంగ్రెస్‌ నేత బక్క జడ్సన్‌ సవాల్‌


మాట్లాడుతున్న బక్క జడ్సన్‌

వర్ధన్నపేట: గోపాల్‌పూర్‌ చెరువు కబ్జాపై ఈ నెల 26న బహిరంగ చర్చకు రావాలని బీఆర్‌ఎస్‌ వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు కాంగ్రెస్‌ నేత బక్క జడ్సన్‌ సవాల్‌ విసిరారు. ఈ మేరకు మంగళవారం వర్ధన్నపేట తహసీల్‌ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్లు అతికించి, ప్రదర్శిస్తూ మాట్లాడారు. ఎమ్మెల్యే రమేష్‌.. నియోజకవర్గంలోని గోపాల్‌పూర్‌, భీమారం చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములతో పాటు, చెరువులు, కుంటలు, నాలాలను కబ్జా చేశారని ఆరోపించారు. అదేవిధంగా రూ. 6 కోట్ల అభివృద్ధి నిధులను మాయం చేశారని మండిపడ్డారు. గోపాల్‌పూర్‌ ఊర చెరువును పూర్తిగా కబ్జా చేయడానికి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అంతకు ముందు తహసీల్‌ కార్యాలయంలో అన్ని పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌ స్టేషన్‌లలో ఎస్సై, సీఐ, ఏసీపీ స్థాయి అధికారులను బదిలీ చేయాలని ఎలక్షన్‌ రిటర్నింగ్‌ అధికారి, అడిషనల్‌ కలెక్టర్‌ అశ్విని వాకడేను కోరారు. ఈ సందర్భంగా ఎలక్షన్ల సమయంలో అక్రమాలను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నేతలు చిదిరాల సమ్మయ్య, ఎల్లస్వామి, ఎర్ర శ్రీకాంత్‌, తుల రవి, కర్ర శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం వద్ద పెరిగిన గోదావరి

- ప్రాణహిత ఇన్‌ఫ్లో 4.29 లక్షల క్యూసెక్కులు


కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్రలో కురిసిన వర్షాల కారణంగా జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. మంగళవారం ఎగువ మంచిర్యాల మీదుగా గోదావరి, ఇటు గడ్చిరోలి నుంచి ప్రాణహిత నదులు తరలి వస్తున్నాయి. దీంతో కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతి)బ్యారేజీలో 66గేట్లకు గాను 6గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. ఇన్‌ఫ్లో 15,410క్యూసెక్కులు. దిగువన కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు కలిసి తరలిరావడంతో మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 4.29లక్షల క్యూసెక్కులు. దీంతో ఇంజనీరింగ్‌ అధికారులు బ్యారేజీలోని మొత్తం 85 గేట్లను ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు.

థాయిలాండ్‌ సదస్సుకు 'మార్నేని'


సదస్సులో డీసీసీబీ చైర్మన్‌ రవీందర్‌ రావు, ఇతర ప్రతినిధులు

హన్మకొండ: వ్యవసాయ సహకార అభివృద్ధి నెట్‌వర్క్‌ సదస్సులో పాల్గొనేందుకు వరంగల్‌ డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు మంగళవారం థాయిలాండ్‌ వెళ్లారు. ఈ నెల 22 నుంచి 25 వరకు బ్యాంకాక్‌లో ఈ సదస్సు జరుగుతుంది. 'స్థిరమైన ఫైనాన్సింగ్‌, అభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. కాగా, ఐసీబీఏ చైర్మన్‌ సుబ్రహ్మణ్యం, నాడాక్‌ డైరెక్టర్‌ కృష్ణారావు, జాతీయ సహకార బ్యాంకు చైర్మన్‌ కొండూరు రవీందర్‌ రావు, టీఎస్‌కాబ్‌ ఎండీ నేతి మురళీధర్‌ రావు, తదితరులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య


చందర్‌ (ఫైల్‌)

హసన్‌పర్తి: అప్పు చెల్లించలేక ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో జరిగింది. గ్రామానికి చెందిన సందెల చందర్‌(36) అదే గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి మహేందర్‌రెడ్డికి సంబంధించిన నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. పంట కోసం వివిధ వర్గాల నుంచి సుమారు రూ. 2 లక్షల వరకు అప్పు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నాడు. ఇటూ తీసుకొచ్చిన అప్పు పెరగడం.. అటూ కుటుంబ పోషణ భారం కావడంతో మనోవేదకు గురయ్యాడు. దీంతో మంగళవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూడగా చందర్‌ మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య కరుణ, కుమారుడు సాకేత్‌, కూతురు సహస్ర ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు.

కుటుంబ కలహాలతో అశ్వరావుపల్లిలో వృద్ధుడు..


యాదగిరి (ఫైల్‌)

రఘునాథపల్లి: కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అశ్వరావుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన వరికుప్పల యాదగిరి (67) మూడు రోజుల క్రితం భార్య ఎల్లమ్మతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన.. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న యాదగిరిని స్థానికులు గుర్తించి వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీధర్‌ మృతదేహం

వెంకటాపురం(కె): మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఆలుబాక గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఎర్రమాటి శ్రీధర్‌ (46) ఈ నెల 20 తేదీన రామచంద్రాపురం గ్రామంలో తమ బంధువుల ఇంట్లో జరిగిన ఓ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో తమ బంధువుల కారును వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో కారు ధ్వంసంకావడంతో కుటుంబీకులు మందలించారు. దీనికి మనస్తాపానికి గురైన ఆయన అదే రోజు రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు సోమవారం వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మంగళవారం భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.

నాణ్యత లేకుంటే ఏజెన్సీ రద్దు

- ఐటీడీఏ పీఓ అంకిత్‌


దరఖాస్తులను ఓపెన్‌ చేస్తున్న ఐటీడీఏ పీఓ

ఏటూరునాగారం : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 32 కస్టర్లలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, స్పోర్ట్స్‌ స్కూళ్లు, కళాశాలలకు సరఫరా చేసే సరుకులు నాణ్యతగా లేకుంటే ఏజెన్సీని రద్దు చేస్తామని ఐటీడీఏ పీఓ అంకిత్‌ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో టెండర్ల దరఖాస్తులను ఓపెన్‌ చేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఆరు రకాల సరుకులు చికెన్‌, కోడిగుడ్లు, కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు ఏడాది పొడవునా కేటాయించిన క్లస్టర్‌ పరిధిలో గిరిజన విద్యాసంస్థలకు సరఫరా చేసేందుకు ఒక్కో దరఖాస్తుకు రూ.30వేలు ఈఎండీలు చెల్లించి టెండర్లు వేశారన్నారు. ఈ టెండర్లలో 19 దరఖాస్తులకు ఈఎండీ డీడీలు ఉండగా ఒక దరఖాస్తుకు లేకపోవడంతో రద్దు చేశామన్నారు. ప్రభుత్వ తెలిపిన ధరల మేరకు సరుకులు సరఫరా చేయాలన్నారు. నాసిరకంగా సరఫరా చేస్తే వెంటనే ఏజెన్సీతోపాటు లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందా లేదా అనే విషయంపై డీడీ, ఏటీడీఓలు నిత్యం తనిఖీలు చేపట్టారు. హెచ్‌డబ్ల్యూఓలు కూడా కాంట్రాక్టర్‌ సరఫరా చేసే సరుకులను తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలన్నారు. కార్యక్రమంలో డీడీ పోచం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఏటీడీఓ దేశిరాం, ఉమ్మడి వరంగల్‌ జిల్లా హెచ్‌డబ్ల్యూఓలు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిలో భాగమే జానపద విజ్ఞానం


మాట్లాడుతున్న వెంకన్న

విద్యారణ్యపురి: సంస్కృతిలో భాగమే జానపద విజ్ఞానమని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్‌ గడ్డం వెంకన్న అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జానపద గిరిజన విజ్ఞానపీఠం అందించే ప్రతిభా పురస్కారాన్ని ప్రముఖ చిందుయక్షగానకళాకారుడు సారంగపాణికి అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జానపద విజ్ఞానం అనే పదాన్ని పరిచయం చేసింది ఇక్కడి గిరిజన పీఠమేనన్నారు. పీఠం స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు జానపదులపై చేసిన పరిశోధనలు వెలకట్టలేనివన్నారు. అత్యున్నత జానపద గిరిజనులపై పరిశోధనలు ఇక్కడే జరిగాయన్నారు. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ శ్రీమంతుల దామోదర్‌ మాట్లాడుతూ పీఠం అపురూపమైన జానపద కళారూపాలను డాక్యుమెంటేషన్‌ చేసి కాపాడుతుందని, ఇంకా మరిన్ని ఉన్నత పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు. ప్రతిభా పురస్కారం గ్రహీత సారంగపాణి మాట్లాడుతూ కళాకారులను ప్రభుత్వం ఆదుకుని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పీఠం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ అబ్బు గోపాల్‌రెడ్డి, సిబ్బంది గంపాసతీష్‌, పరావస్తు విజయలక్ష్మి, ఎస్‌ సునంద, ఆంజనేయులు, అశోక్‌, సులోచన, కస్తూరిబాయి, నోయముల రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మన వరంగల్‌లోని శంభునిపేట సమీపంలో నాయుడు పెట్రోల్‌ పంప్‌, వినాయకనగర్‌లో 170 గజాల Open Plot కలదు. సంప్ర॥ సెల్‌: 9849063958. [W-189138]

■ వరంగల్‌ జాన్‌ పీరీలు రైల్వే గేట్‌ ప్రక్కన్న 109 గజాల ఉత్తరం ఫేస్‌ గల Open Plot అమ్మబడును వివరాలకు సంప్ర॥ సెల్‌: 9849459661. [W-189137]

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్‌ వెళ్లె 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన ఐబ్బుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-27211]

■ మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్‌ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్‌: 9032111600. [W-189151]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్‌ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-27214]

SERVICES

■ శ్రీ రామ్‌ గోల్డ్‌ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధరకు కొనబడును. ఫోన్‌ :9133214214 [H-788623]

WANTED

■ Wanted DTH Office Co-ordinater (Warangal) Local candidate only. Qua: Any Degree with system knowledge. Good Salary. JPN Road Warangal, Cont: 9848011656. [W-189142]

■ మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్‌ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్స్‌ వాట్సప్‌ చేయండి. వివరాలకు కాల్‌ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221522]

■ ఇంటిపని, బేబికేర్‌, పేషెంట్‌కేర్‌, నర్సెస్‌ M/F డ్రైవర్‌, భార్యభర్తలు వంటపని, జీ: 15K to 25K, 24Hrs. రూం + భోజనం, లోన్‌ బోనస్‌ ఫ్రీ. ఫోన్‌ : 9160002193, 9160002192 [H-189519]

■ హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్‌ : 9640258899, 9640468899 [HA-189323]

WANTED TEACHERS

■ Wanted Teacher to teach Physical Science for VIII to X (PT) Kothur, Hanamkonda, Cell: 9293920935. [WA-7219]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్‌ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్‌ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్‌ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.